

పూలను కొలిచి.. గౌరిని తలచి

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు గౌరమ్మ ఉయ్యాలో.. అంటూ పాటలు పాడుతూ.. సంప్రదాయబద్ధంగా ఆడుతూ.. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ పండగను వైభవంగా నిర్వహించారు. అందంగా పేర్చిన పూలను స్థానిక చెరువులు, కుంటల వద్దకు తీసుకెళ్లి ఆడిపాడారు. ఫసల్‌వాదిలో తయారు చేసిన 26 అడుగుల భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అందోలులో పురపాలక అధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్‌లో ఆర్యవైశ్య సంఘం, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం.

జిల్లాలో ఉత్సాహంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

గుమ్మడిదలలో బతుకమ్మ సంబరాలు



కూరగాయలతో అలంకరణ



జహీరాబాద్‌లో ఆకట్టుకున్న బతుకమ్మ



హత్నూరలో నీటిలో బతుకమ్మను వదులుతూ..



జిన్నారం మండలం మంత్రి కుంటలో..



ఖేడ్ మండలం బానాపూర్‌లో..



రాంసానిపల్లి గ్రామంలో..



యువతి ఉత్సాహం



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి



వట్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఫసల్‌వాదిలో భారీ బతుకమ్మ..



ఉత్సాహంగా ఆడుతూ..

పాఠశాల సముదాయానికి స్థల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పుల్కల్, న్యూస్‌టుడే: మండల పరిధి బస్వాపూర్ శివారులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ (పాఠశాల సముదాయం) కోసం ప్రతిపాదించిన స్థలాన్ని గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. బస్వాపూర్ శివారులోని సర్వే నెంబరు 417లో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు ఎంపిక చేశారు. ఈ స్థలానికి సంబంధించిన వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనంగా మరో 5 ఎకరాల సేకరణకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. త్వరలో పాఠశాల సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ లోగా స్థలాన్ని చదును చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, తహసీల్దారు కృష్ణ, ఆర్ఐ దావూద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాజపాతోనే దేశాభివృద్ధి: బీబీ పాటిల్



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాజీ ఎంపీ..

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. గురువారం పట్టణంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ బాధ్యుడు పలువట్ల జగదీశ్వర్, కన్వీనర్ ప్రభాత్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజ



పూజల్లో పాల్గొన్న ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో సాయుధ పోలీసు కార్యాలయంలో గురువారం ఆయుధ పూజ నిర్వహించామని ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. అనంతరం దుర్గామాతకు పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పల్లెలకు నిధులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

పంచాయతీలకు రూ.9.01 కోట్లు విడుదల

పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. నిధుల లేమితో సమస్యలు పరిష్కారానికి నోచని పరిస్థితి. వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారగా.. పారిశుధ్య సమస్యలతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 2 వరకు పంచాయతీలకు పాలకవర్గాలు ఉండగా.. ఎలాగోలా నెట్టుకొచ్చారు. సొంత నిధులు సైతం వెచ్చించి నిధులు వచ్చినప్పుడు తీసుకునేవారు. వీరి పదవీ కాలం ముగియడంతో బాధ్యతలు చేపట్టిన అధికారులు పంచాయతీ ఖాతాలో నిధులు ఉంటేనే పనులు చేపడుతున్నారు. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నప్పటికీ.. ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా మారింది. రూ.9.01 కోట్ల నిధులు విడుదల కావడంతో కొంతమేరకైనా ఇబ్బందులు దూరం కానున్నాయి.

నిధులు ఇలా(రూ.కోట్లలో)

● జిల్లాకు విడుదలైన నిధులు:	9.01
వీటిలో కేటాయింపులు	
● స్వచ్ఛత, పచ్చదనానికి:	3.65
● కార్మికుల వేతనాలకు:	2.89
● విద్యుత్తు ఛార్జీలకు..:	1.99
● ట్రాక్టర్ వాయిదాల చెల్లింపులకు(రూ. లక్షలు):	48.56

నిర్వహణకు ఇబ్బందులు లేకుండా..

జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల్లో చెత్త సేకరణకు ట్రాక్టర్లతోపాటు నీటి సరఫరాకు ట్యాంకర్లను ఉపయోగిస్తున్నారు. వీటికి సంబంధించిన చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యుత్తు ఛార్జీలు సైతం పేరుకుపోయాయి. ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేయడంతో బకాయిలు చెల్లించనున్నారు. పంచాయతీ కార్మికుల వేతనాల చెల్లింపులకు ఈ నిధుల్ని వినియోగించుకోనున్నారు. ప్రస్తుతం పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్యలు రాజ్యమేలుతున్నాయి. తాజాగా విడుదలైన నిధులతో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు చొరవ చూపాల్సిన అవసరముంది.



తొప్పుగొండ గ్రామం

ప్రాధాన్య క్రమంలో వెచ్చించాలి

–సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి

ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ప్రజల ఇబ్బందులు తీర్చేలా ప్రాధాన్యక్రమంలో ఖర్చు చేయాలి. నిధులు సద్వినియోగమయ్యేలా చూడాలని ఇప్పటికే క్షేత్ర స్థాయి అధికారులకు సూచించాం. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి. సిబ్బందికి వేతనాలు చెల్లించాలి.

22న సదరం శిబిరం

సంగారెడ్డి అర్బన్: ఈ నెల 22న జిల్లా ఆసుపత్రిలో సదరం శిబిరం నిర్వహించనున్నామని జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి గాయత్రీదేవి తెలిపారు. ఈ నెల 15న ఆన్‌లైన్‌లో స్లాట్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించండి

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలోని 8 పురపాలికల పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్‌పై పురపాలక అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ లేఔట్లలో పారదర్శకంగా క్రమబద్ధీకరణ చేపట్టాలని పేర్కొన్నారు. దరఖాస్తులను రెవెన్యూ శాఖ అధికారుల సహకారంతో పరిశీలించాలన్నారు. ఇందుకోసం అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. సమావేశంలో పురపాలక కమిషనర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య భద్రత

కొండాపూర్, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటునే ఆరోగ్య భద్రత లభిస్తుందని డీఎల్‌పీవో అనిత పేర్కొన్నారు. గురువారం ఆమె కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామంలో పర్యటించారు. మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ ప్రదీప్ తదితరులు వెంట ఉన్నారు.

ఆధునిక యంత్రం.. చెరకు రైతుకు ఊతం



చెరకు పంట కోత సీజన్ సమీపించింది. జహీరాబాద్ ప్రాంతంలో ఏటా చెరకు నరికే కూలీల కొరత వల్ల కర్షకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు అన్నదాతలు ఆధునిక కోత యంత్రాలు కొనుగోలు చేస్తున్నారు. గురువారం జహీరాబాద్‌లో నలుగురు రైతులు కొనుగోలు చేసి తీసుకొచ్చిన యంత్రాలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. –న్యూస్‌టుడే, జహీరాబాద్.

ఒత్తిడికి గురయితే వైద్యులను సంప్రదించండి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మానసిక ఒత్తిడిగి గురయితే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా కోర్టు న్యాయమూర్తి జి. భవానీ చంద్ర పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళా ఉద్యోగులు ఇంట్లో, పని ప్రదేశాల్లో శ్రమకోడుస్తూ చాలా ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు కె. జయంతి, కృష్ణార్జున్, సునీత, లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కోర్టు న్యాయమూర్తి భవానీచంద్ర

డీఎస్సీకి ఎంపికైనవారు నేడు రిపోర్టు చేయాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: డీఎస్సీకి ఎంపికై ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామకపత్రాలు అందుకున్నవారు శుక్రవారం డీఈవో కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

ఇసుక దందాకు అడ్డుకట్టేది?

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్(ఇస్మాయిల్‌ఖాన్‌పేట), సంగారెడ్డి గ్రామీణ, కంది(ఇంద్రకరణ్)

నక్కవాగు పరీవాహకంలో యథేచ్ఛగా కృత్రిమ తయారీ

జిల్లాలోని నక్కవాగు పరీవాహక ప్రాంతాల్లో కృత్రిమ ఇసుక తయారీ యథేచ్ఛగా కొనసాగుతోంది. అప్పుడప్పుడు నామమాత్రపు దాడులు చేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి. ఇసుక దందాను నిలువరించడంలో విఫలమయ్యారని సంగారెడ్డి గ్రామీణ సీఐ అశోక్ కుమార్‌నాయక్‌ను ఐజీ కార్యాలయానికి, గ్రామీణ ఎస్ఐ వినయ్‌కుమార్‌ను సంగారెడ్డి ఎస్పీ కార్యాలయం వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఇటీవల మల్టీజోన్ ఐజీ వి. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం పోలీసుశాఖలో సంచలనం రేపింది. వారిపై వేటు వేసినప్పటికీ ఇసుక దందా యథావిధిగా కొనసాగుతూనే ఉంది.

ఈ ప్రాంతాలపై దృష్టి సారిస్తేనే..

పటాన్‌చెరు మండలంలో ప్రారంభమయ్యే నక్కవాగు సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచెర్ల, హనుమాన్‌నగర్, దాసుగడ్డతండా, కంది మండలం బ్యాతోల్, ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట, ఎర్దనూర్, హత్నూర మండలంలోని పల్పనూర్, గుండ్లమాచనూర్ గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. ఆ వాగు పరీవాహకంలో కృత్రిమ ఇసుక తయారీ ఏళ్లుగా కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మట్టిని నక్కవాగు నీటితో కడుగుతూ కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారు. ఈ ప్రాంతాల నుంచి నిత్యం సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక తయారు చేస్తున్నారు. 30-40 టన్నుల ఇసుక లారీకి రూ.30వేల నుంచి రూ. 40వేల వరకు వ్యాపారులు వసూలు చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ఇసుక లారీలు వెళుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు లేని తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



హనుమాన్ నగర్ శివారులో ఇసుక తయారీ

రహదారులు ధ్వంసం

ఇసుక ఫిల్టర్ల యజమానులు లారీలు, ట్రాక్టర్లలో పరిమితికి మించి భారీగా ఇసుక తరలిస్తుండటంతో.. పల్లె దారులు ధ్వంసమయ్యాయి. ప్రజలు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రూ. లక్షల వ్యయంతో వేసిన దారులు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి.

వ్యవసాయ విద్యుత్తు వినియోగిస్తూ..

ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచెర్ల శివారుల్లో భారీగా ఇసుక తయారు చేస్తున్నారు. హనుమాన్‌నగర్‌లో పలువురు వ్యాపారులు వ్యవసాయ బోరుబావుల కోసం ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న విద్యుత్తును ఇసుక తయారీకి వినియోగిస్తున్నారు. అక్రమాన్ని అడ్డుకోవాల్సిన విద్యుత్తు శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

వ్యాపారులపై క్రిమినల్ కేసులు

సంగారెడ్డి డివిజన్‌లో అనుమతి లేకుండా ఇసుక తయారు చేస్తున్న వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. కృత్రిమ ఇసుక తయారీపై విచారించి చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశాలు జారీ చేస్తాం. వ్యవసాయానికి వినియోగించే ఉచిత విద్యుత్తును ఇసుక తయారీకి వినియోగించడం సరికాదు.

–రాజు, ఇన్‌ఛార్జి ఆర్‌డీవో, సంగారెడ్డి.

అధిక నిధుల కేటాయింపుతోనే విద్యారంగం బలోపేతం



ప్రసంగిస్తున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి ఓ అంతర్జాతీయ పాఠశాల ఏర్పాటు చేయాలనే ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. 1 నుంచి 3 తరగతులను అంగన్‌వాడీల్లో కలపాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యా పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సంజీవయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్, కార్యదర్శి అశోక్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: కస్తూర్బా పాఠశాలల్లో అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు అర్హులైన మహిళలు ఈ నెల 19వ తేదీ వరకు సమగ్ర శిక్షా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. 21న మెరిట్ జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే 23న సమగ్ర శిక్షా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఆర్ఎస్ఎస్ కవాతు

రామచంద్రాపురం రూరల్: రామచంద్రాపురంలో ఆర్ఎస్ఎస్ విభాగం ఏర్పాటై 99 ఏళ్లు పూర్తిచేసుకొని.. 100వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా జాతీయ రహదారి నుంచి రామచంద్రాపురం, బీరంగూడ, జయలక్ష్మినగర్, భెల్ డిపో ప్రాంతాల మీదుగా గురువారం కవాతు నిర్వహించారు. పౌర నియమాలు పాటించాలని వక్తలు పేర్కొన్నారు.

తీరొక్క బతుకమ్మ..



సిద్దిపేటలో ధనలక్ష్మి బతుకమ్మ



మెదక్ పరిధి జంబికుంటలో



సిద్దిపేటలో శివ లింగం రూపంలో..

ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాము లాయె సందమామా.. అంటూ ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క రూపులో అలంకరించిన తీరు అందరినీ ఆకట్టుకోవడం విశేషం.
– న్యూస్‌టుడే బృందం



రేగోడ్‌లో అమ్మవారి ప్రతిమతో..



సిద్దిపేటలో పూలతో ఇలా..



రామాయంపేటలో దుర్గాదేవి, అయోధ్య రామ మందిరంగా కొలువుదీరిన బతుకమ్మ



సిద్దిపేటలో

ఇష్టంతో ఆడి.. ఛాంపియన్లుగా నిలిచి..

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ఫుట్‌బాల్.. ప్రపంచాన్ని ఊపేసే ఆట. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎంతో మంది రాణించారు. మెదక్, జహీరాబాద్ ప్రాంతాల్లో ఈ ఆట ఎక్కువగా ఆడుతుంటారు. ఇలాంటి క్రీడల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారిణులు రాణిస్తూ జాతీయస్థాయిలో తమ సత్తా చాటుతుండటం విశేషం. తాజాగా మెదక్‌లో 68వ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర ఛాంపియన్ జరిగాయి. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు జట్టును విజయ బాటలో నడిపించి, ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో ఫుట్‌బాల్‌కు క్రేజ్ ఉండటంతో ఫుట్‌బాల్ అసోసియేషన్ మెదక్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు మెదక్ - 8, సిద్దిపేట- 7, సంగారెడ్డి- ముగ్గురిని ఎంపిక చేశారు. వీరికి పోటీలకు నాలుగు రోజుల ముందు నుంచే మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. రాష్ట్రస్థాయి పోటీలో పలువురు తమ ఆటతో రాణించారు. వారిలో ఉమ్మడి మెదక్ నుంచి 5 మందిని జాతీయస్థాయి పోటీలకు ఆడే రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారు.

తండ్రి ఇష్టం మేర..



జట్టుకు సిద్దిపేట జిల్లా కొండపాక మండలం జప్తినాచారానికి చెందిన చైతన్య శ్రీ కెప్టెన్‌గా వ్యవహరించారు. తల్లిదండ్రులు కవిత, రాములు. ప్రస్తుతం సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. రాములుకు ఫుట్‌బాల్ అంటే మక్కువ. దీంతో తన కుమార్తెను అంతర్జాతీయ క్రీడాకారిణిగా చూడాలన్న లక్ష్యంతో చైతన్యశ్రీ నాలుగో తరగతి చదువుతున్న సమయంలోనే హకీంపేట క్రీడా పాఠశాలలో చేర్పించారు. తండ్రి ఇష్టాన్ని గమనించిన ఆమె ఏడో తరగతి పూర్తయ్యాక ఇంటికొచ్చి సొంతంగా సాధన చేస్తూ వచ్చారు. శిక్షకురాలు భాగ్యమ్మ చరవాణి ద్వారా ఇచ్చే సలహాలు పాటిస్తూ వచ్చారు. తాజాగా ఎస్జీఎఫ్ పోటీల్లో మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో కెప్టెన్‌గా కీలకపాత్ర పోషించారు. ఫైనల్‌లో తన ఆట తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈమె ప్రత్యర్థి జట్టు గోల్ చేయకుండా అడ్డుకోవడం అందరినీ ఆకట్టుకుంది.

తొలి ప్రయత్నంలోనే..





ఎస్జీఎఫ్ పోటీల్లో జరిగిన ఫైనల్‌లో ఇరు జట్లు సమాన పాయింట్లు పొందాయి. ఫలితానికి అదనంగా 5 నిమిషాల్లో ఆట ఆడారు. ఫలితం తేలకపోవడంతో అందరూ నిరుత్సాహపడ్డారు. మరోసారి 5 ని. సమయం ఇచ్చి ఆడించారు. 2 ని. ముందు గోల్ చేసి మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో క్రీడాకారిణి శ్రీవాణి కొట్టిన గోలే కారణం. ఈమె స్వగ్రామం మెదక్ మండలం సంగాయిగూడ తండా. తండ్రి తార్య మెదక్‌లో హోంగార్డు, తల్లి మహిళా రైతు. శ్రీవాణి మెదక్ తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. భాగ్యమ్మ వద్ద శిక్షణ పొందుతున్నారు. తొలిప్రయత్నంలోనే జాతీయస్థాయిలో ఆడే జట్టుకు ఎంపికయ్యారు.

'ఈనాడు' లక్ష్య ఆధ్వర్యంలో..

ఉమ్మడి మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో క్రీడాకారిణులకు శిక్షణ ఇచ్చారు. వారికి ఆయనే సొంతంగా భోజనం ఏర్పాటుచేయించారు. స్థానిక టీజీఆర్ఎస్‌లో వసతి కల్పించారు. వారికి 'ఈనాడు' ఆధ్వర్యంలో 'లక్ష్య' కార్యక్రమంలో భాగంగా నియమించిన శిక్షకురాలు భాగ్యమ్మ ప్రత్యేకంగా తర్ఫీదు ఇచ్చారు. ప్రధానంగా క్రీడాకారిణుల్లో సమష్టిభావాన్ని పెంపొందించారు.

తొలిసారి ఆడిపాడి



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పెద్దతండాలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచి గుగులోతు లక్ష్మి సక్రునాయక్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఆడిపాడటం విశేషం. గతంలో ఈ గ్రామంలో బతుకమ్మ ఆడే సంప్రదాయం లేకపోవడం గమనార్హం.
– న్యూస్‌టుడే, అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం)

అమెరికాలో వైభవం చాటి..



అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసం ఉంటున్న సిద్దిపేట వాసుల బతుకమ్మ సంబరాలు
– న్యూస్‌టుడే, సిద్దిపేట

సనాతన ధర్మాన్ని కాపాడాలి: సుమన్



కాళికామాతకు అభిషేకం చేస్తున్న సినీ నటుడు సుమన్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడాలని, కుల మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవించాలని సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. వెల్దుర్తి మండలం మన్నెవారిజలాల్‌పూర్ శివారులో కాళికామాత ఆలయంలో గురువారం నిర్వహించిన దివ్య విశ్వశాంతి మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని వారి విజ్ఞతకు వదిలేస్తున్నానని, తిరుపతి లడ్డూ వ్యవహారంపై విచారణ జరుగుతోందని, ఇవన్నీ చూస్తుంటే బాధ కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అన్ని కులాలు, మతాలకు చెందిన స్నేహితులున్నారని పేర్కొన్నారు. మన్నెవారిజలాల్‌పూర్ కాళికామాత అమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశం బాగుండాలని, సినిమా పరిశ్రమ బాగుండాలని, చిన్న నిర్మాతలు ఆర్థికంగా ఎదగాలని అమ్మవారిని కోరుకున్నట్లు సుమన్ తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్, భారాస, భాజపా పార్టీలకు చెందిన నాయకులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



సుధాకర్

శివ్వంపేట: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని గొట్టిముక్లకు చెందిన జరుపటి సుధాకర్(19) బుధవారం రాత్రి కాలినడకన వెళ్తున్నాడు. అదే సమయంలో చెన్నాపూర్‌కు చెందిన ద్విచక్ర వాహనదారుడు చిన్నగొట్టిముక్ల కొత్త కాలనీ వద్ద సుధాకర్‌ను ఢీకొట్టడంతో మృతి చెందాడు. తండ్రి నాగేష్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. కుమార్తె వివాహం వచ్చే నెలలో ఉందని, ఈ తరుణంలో కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదైంది.

గునుగు పూలకు వెళ్లి..



వెంకటేష్

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం): బతుకమ్మ పేర్చేందుకు గునుగుపూలు తెచ్చేందుకు వెళ్లిన మాజీ ఉపసర్పంచి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారం రాజీవ్ రహదారిపై జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. లకుడారానికి చెందిన మాజీ ఉపసర్పంచి బింగి వెంకటేశ్ (39) గురువారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లాడు. తిరిగొస్తుండగా మలుపు వద్ద వెంకటేశ్ వాహనాన్ని హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టడంతో కింద పడి మృతి చెందాడు. కారును గోదావరిఖనికి చెందిన బొల్లి రాజు నడిపిస్తున్నారు. వెంకటేశ్ సోదరుడు మల్లేశం ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పరోపకారుడు.. విధికి తలవంచాడు



అనంత్‌రెడ్డి

హైదరాబాద్, వికారాబాద్: పెద్ద చదువులు చదవకపోయినా ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ నలుగురికి సాయం చేసే మనస్తత్వం అతని సొంతం.. ఆపత్కాలంలో ఉన్న పలువురికి 26 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. ప్రేమించిన యువతిని తల్లిదండ్రులను ఒప్పించి ఏడాదిన్నర కిందట కులాంతర వివాహం చేసుకున్నాడు. పరోపకారిగా పేరు తెచ్చుకున్న ఆ యువకుణ్ని రోడ్డు ప్రమాదం కబళించింది. సాయం చేసే చేతులు ఇక లేవన్న నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇద్దరు ఆడపిల్లల తరువాత అనంతపద్మనాభస్వామికి మొక్కుకుంటే జన్మించగా, ఎంతో అపురూపంగా ఆ దేవుడి పేరే పెట్టారు. అయినా ఇలా అయిందేమిటని, అతన్ని మంచితనాన్ని చూసైనా మృత్యువు కరుణించలేదని ఆ తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కేపీహెచ్‌బీ ఎస్సై నజీర్‌మియా తెలిపిన వివరాలు.. వికారాబాద్ మండలం గోదమగూడకు చెందిన ఏనుగు అనంత్‌రెడ్డి(24) ఫొటోగ్రాఫర్. సామాజిక కార్యకర్త. తలసేమియా వ్యాధిగ్రస్తులు, ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తదానం చేశాడు. ఆగస్టు 11న అర్ధరాత్రి బైక్‌పై ఒంటరిగా ఉప్పల్ నుంచి కేపీహెచ్‌బీ వైపు వచ్చాడు. జేఎన్‌టీయూ సిగ్నల్ దాటాక బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలవగా, కాచిగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి కోమాలోనే ఉన్న అనంత్‌రెడ్డి ప్రాణాలు కోల్పోయాడు.

విద్యుదాఘాతంతో బీటెక్ విద్యార్థి మృతి



అనిల్‌కుమార్

చేగుంట, న్యూస్‌టుడే: చదువుకుంటూనే.. తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్న ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మెదక్ జిల్లా చేగుంట ఎస్ఐ చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన గడ్డమీది మంజుల, కిషన్ దంపతులు చేగుంటలోని గజ్వేల్ మార్గంలో ఉంటూ పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు అనిల్‌కుమార్(21), వినయ్ ఉన్నారు. అనిల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధి హోలీ మేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం, చిన్న కుమారుడు ఇంటర్ చదువుతున్నారు. సెలవులకు అనిల్ ఇంటికొచ్చాడు. గురువారం మిత్రుడు సమీర్‌తో కలిసి పాత ఇనుప సామగ్రిని చిన్న లారీలో ఎక్కిస్తున్నాడు. ఇనుప నిచ్చెన పైకి ఎత్తుతుండగా 11 కేవీ విద్యుత్తు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అనిల్ మృతిచెందాడు. కళ్లముందు విగతజీవిగా పడిఉన్న కుమారుణ్ని చూసి తల్లిదండ్రులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. గాయపడిన సమీర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి ఒడి చేరిన పసికందు

పోలీసుల అదుపులో ఇద్దరు మహిళలు



శిశువుతో తల్లి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మాతృత్వం.. మహిళలకే ప్రత్యేకమైన ఓ వరం. ఓ మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చి దాన్ని పంచితే.. భూమ్మీద పడగానే అభంశుభం తెలియని ఆ బిడ్డను తల్లి పొత్తిళ్లకు దూరం చేసి అమ్మదనానికి మాయని మచ్చ తెచ్చారు మరో నలుగురు మహిళలు. అధునాతన సాంకేతికతకు పోలీసుల చొరవ తోడు కావడంతో 24 గంటల్లోనే ఆ శిశువు తల్లి ఒడి చేరింది. వివరాలు ఇలా..

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అపహరణకు గురయిన పసికందు ఆచూకీ లభించింది. నలుగురు మహిళలు బుధవారం శిశువును అపహరించినట్లు సీసీ కెమెరాల్లో నమోదయిన విషయం విదితమే. సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును 24 గంటల్లోనే ఛేదించారు. గురువారం హైదరాబాద్‌లోని బోరబండ పరిధి అల్లాపూర్‌లో నిందితులైన ఇద్దరు మహిళలను సంగారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను శుక్రవారం వెల్లడిస్తామని సీఐ స్పష్టం చేశారు.

10 బృందాలతో గాలింపు

మనూరు మండలం దూదిగొండకు చెందిన నసీమా ఈ నెల 9న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ ద్వారా ఆడ శిశువుకు జన్మనిచ్చారు. నసీమా తల్లీ మునీబీ, అత్త హమీదాలు ఆసుపత్రి ఆవరణలోని కారిడార్‌లో ఆ శిశువును పడుకోబెట్టగా నలుగురు మహిళలు వచ్చి గుట్టుగా అపహరించారు. అక్కడి నుంచి స్కూటీపై ఉడాయించారు. సీసీ కెమెరాల్లో నమోదయిన దృశ్యాల ఆధారంగా వెంటనే చెక్ పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు పెంచారు. ఎస్పీ రూపేష్ ఆదేశాలతో పది ప్రత్యేక బృందాలను నియమించారు. విశ్వసనీయంగా అందిన సమాచారం ఆధారంగా హైదరాబాద్ బోరబండలోని అల్లాపూర్‌లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శిశువును తల్లి ఒడికి చేర్చారు. దీంతో తల్లితో పాటు కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు. శిశువులను అపహరించేందుకు నిందితులు పలుమార్లు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పసికందు అపహరణ నేపథ్యంలో గురువారం అదనపు ఎస్పీ సంజీవరావు తనిఖీలు చేపట్టారు. మరోమారు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం ఆసుపత్రి పర్యవేక్షకులకు వినతి పత్రం అందజేశారు.

అన్నదాతకు తీపి కబురు

పంట నష్ట పరిహారం మంజూరు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

ఆరుగాలం శ్రమించే రైతులకు ప్రభుత్వం తీపి కబురును వినిపించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో గత నెలలో భారీ వర్షాలు కురిసిన విషయం విదితమే. దీంతో చేతికొచ్చిన పంటలు నీళ్లపాలయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, కోహెడ ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ఇసుక మేటేసి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది.

ప్రధాన పంటలు..

నాలుగు జిల్లాల్లో ప్రధానంగా వరి, పత్తి, కందులు, సోయాబీన్, పెసర, మినుము, చెరకు పంటలకు తీవ్ర నష్టం చేకూరింది. ఇక కూరగాయలు సాగు చేసిన వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఎంతో మంది తాము పెట్టిన పెట్టుబడైనా చేతికొచ్చేనా అని కలవరానికి గురయ్యారు. నష్టం తీరుపై సర్వే చేపట్టి, ఏ మేర దెబ్బతిన్నాయో అంచనా వేసి నివేదిక పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టాన్ని లెక్క తేల్చారు.

33 శాతం మేర..

ప్రభుత్వ ఆదేశాలతో 33 శాతం లెక్కన నష్టాన్ని గుర్తించారు. గ్రామాలు, మండలాల వారీగా క్రోడీకరించిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం మంజూరు చేయడంతో పాటు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. దసర పండగ సమయంలో పరిహారంపై ప్రభుత్వ ప్రకటనతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నష్టపోయిన పంట

నాలుగు జిల్లాల్లో నష్టపోయిన ఎకరాలు, రైతులు, పరిహారం మంజూరు వివరాలు..

జిల్లా	నష్టం	రైతులు	పరహారం (రూ.లలో)
సంగారెడ్డి	3288.34	2881	3,28,88,500
సిద్దిపేట	727.34	877	72,76,000
మెదక్	157.12	147	11,30,500
వికారాబాద్	1512.32	1378	1,51,28,000

ఆరోగ్యానికి గుడ్డు

నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం

న్యూస్‌టుడే, సిద్దిపేట



కోడిగుడ్డు.. ఎన్నో పోషకాల సమాహారం. ఎంతో మంది నిత్యం తీసుకునే ఆహారంలో ఓ భాగం. ఉడకబెట్టిన గుడ్డులో పోషకాలు పుష్కలమని వైద్య నిపుణులు చెబుతున్నారు. చౌకగా.. సులువుగా లభించే ఆహారం కావడం మరో విశేషం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో గుడ్డు ప్రియులు భారీగానే ఉన్నారు. ఈ రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా కలిగే ప్రయోజనాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉడికించిన కోడిగుడ్డు తింటే లభించే పోషకాలు

- విటమిన్ ఎ - 6 శాతం
- విటమిన్ బి2- 15 శాతం
- విటమిన్ బి5 - 7 శాతం
- విటమిన్ బి12 - 9 శాతం
- సెలీనియం - 22 శాతం
- ఫోలేట్ - 5 శాతం
- ఫాస్పరస్ - 9 శాతం

జిల్లా	గుడ్ల వినియోగం (సుమారు)
సిద్దిపేట	7 లక్షలు
సంగారెడ్డి	7.5 లక్షలు
మెదక్	2.5 లక్షలు
వికారాబాద్	1.5 లక్షలు


మీకు తెలుసా..

60 గ్రాముల కోడి గుడ్డు నుంచి శక్తి - 103 కేలరీలు, ఇనుము - 1.26 మి.గ్రా, ఫాస్పరస్ - 132 మి.గ్రా, క్యాల్షియం - 36 గ్రాములు, కొవ్వులు - 7.9 గ్రాములు, ప్రొటీన్ - 7.9 గ్రాములు లభిస్తాయి. వాటితో పాటు క్యాల్షియం, జింక్, తదితర ఖనిజాలు, బీ6, డీ, ఈ, కే విటమిన్లు దండిగా ఉంటాయి. ఒక గుడ్డులో 1.5 గ్రాముల పచ్చసొన, 213 మి.గ్రా కొలెస్ట్రాల్, 75 క్యాలరీలు ఉంటాయి.

ప్రయోజనాలు అనేకం..

● పిల్లలకు ఆహారంలో కోడిగుడ్డును తప్పనిసరి చేయాలి. కంటి సంబంధిత సమస్యలు దరిచేరవు. ● నిత్యం గుడ్డు తీసుకుంటే శరీరానికి అవసరమైన కొలెస్ట్రాల్ లభిస్తుంది. ● రక్తపోటు అదుపులో ఉంటుంది. ● అల్పాహారంలో గుడ్డు తీసుకుంటే బరువు తగ్గుతారు. ఎత్తు పెరిగేందుకు దోహదపడుతుంది.

కావాల్సిన పౌష్టికాహారం..: డా. చందర్, అసోసియేట్ ప్రొఫెసర్, సిద్దిపేట సర్వజన ఆసుపత్రి



కోడిగుడ్డులో పోషకాహారం మెండు. గర్భిణులు, చిన్నారులు ఇష్టంగా తినడం అలవర్చుకోవాలి. ఆరోగ్యంగా ఉండేందుకు కావాల్సిన ప్రొటీన్లు ఉపకరిస్తాయి. శరీరం, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

రతన్‌టాటాకు చిత్ర నివాళి





దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటాసన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు సిద్దిపేటకు చెందిన చిత్రకారుడు కిన్నెర అంజయ్య చిత్ర నివాళి అర్పించారు. ఆయన మృతి సమాజానికి తీరని లోటని.. సామాన్యుల కలలను సాకారం చేసిన ఘనత టాటా సొంతమని పేర్కొన్నారు. మెదక్‌కు చెందిన ఓ విద్యార్థి పెన్సిల్ స్కెచ్‌తో చిత్రాన్ని ఆవిష్కరించారు.
- న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్‌అర్బన్

మూతపడిన పరిశ్రమలో భారీ చోరీ యత్నం

మనోహరాబాద్: మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని టీజీఐఐసీ పరిధిలోని మూతపడిన పరిశ్రమలో దుండగులు భారీ చోరీకి యత్నించారు. విషయం తెలిసి పోలీసులు దుండగులను వెంబడించడంతో పారిపోయారు. మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంక్ రుణాలు చెల్లించకపోవడంతో కొన్ని సంవత్సరాల క్రితం బీఎస్ స్టీల్ పరిశ్రమను సీజ్ చేశారు. దీని గురించి ఎవరూ పట్టించుకోకపోవంతో కొన్ని రోజులుగా పరిశ్రమలోని ఇనుప సామగ్రిని మండలంలోని కోనాయిపల్లి, రంగాయపల్లి, ముప్పిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన నిందితులు చోరీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి కొంతమందిని జైలుకు పంపారు. ఇదిలా ఉంటే బుధవారం అర్ధరాత్రి కొంతమంది పరిశ్రమ లోపలికి క్రేన్, టిప్పర్ తీసుకెళ్లి రూ.లక్షల విలువ చేసే భారీ యంత్రాన్ని చోరీ చేసేందుకు పన్నాగం పన్నారు. విశ్వసనీయ వర్గాల ద్వారా పోలీసులకు చోరీ సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి వచ్చే సరికి అక్కడ క్రేన్ మాత్రమే ఉంది. వెంటనే అప్రమత్తమై వెంబండించగా మేడ్చల్ సమీపంలో టిప్పర్ దొరికింది. అందులో భారీ యంత్రం కనిపించడంతో పోలీసులను చూసి దుండగులు వాహనాన్ని వదిలేసి పారిపోయారు. ఎస్బీఐ అధికారి రవీందర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. క్రేన్, టిప్పర్‌ను సీజ్ చేసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. చోరీకి పాల్పడిన వారితో పాటు స్క్రాప్ దుకాణ యజమానిని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితులను త్వరలో అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.

భవానమ్మపల్లెకు పాదయాత్ర



జహీరాబాద్: మొగుడంపల్లి మండలం ఖాన్‌జమాల్‌పూర్ (భవానమ్మపల్లె)లోని తుల్జాభవానీ ఆలయ చరిత్ర తెలిపేందుకు గురువారం యువకులు పాదయాత్ర నిర్వహించారు. పలు గ్రామాల యువకులు జహీరాబాద్ పురాతన భవానీమాత ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించి మధ్యాహ్నానికి భవానమ్మపల్లెకు చేరుకున్నారు.

వ్యర్థాలు.. మలిస్తే అందాలు



పట్టణంలోని ఆక్సిజన్ పార్కులో పాత వాహనాల టైర్లు, కుర్చీలు, పనికిరాని ఇనుప కడ్డీలను ఉపయోగించి తయారు చేసిన ఆకృతులు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. పుర కమిషనరు జగ్జీవన్, పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్ సూచన మేరకు కార్మికులు వివిధ రకాల రూపాలు తయారు చేశారు. – న్యూస్‌టుడే, నారాయణఖేడ్.

పర్వదినాల్లో ట్రాఫిక్ తిప్పలు

న్యూస్‌టుడే, నారాయణఖేడ్

ఖేడ్ పట్టణ జనాభాతోపాటు ట్రాఫిక్ సైతం రోజురోజుకూ పెరుగుతోంది. పట్టణంలోని రోడ్లు ఇరుగ్గా మారాయి. వాహనాలను రహదారుల పైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. నియోజకవర్గం నుంచి ఉపాధికి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, విద్యాసంస్థలకు సెలవులుండటంతో వివిధ ప్రాంతాల్లో చదుతున్న విద్యార్థులు బతుకమ్మ, దసరా పండగలకు సొంతూళ్లకు వచ్చారు. వివిధ వస్తువుల కొనుగోళ్లు, అవసరాలకు వాహనాలపై ఖేడ్‌కు వస్తుండటంతో వారం రోజులుగా పట్టణం కిటకిటలాడుతోంది.

కూడళ్ల సమీపంలో..: పట్టణంలోని అప్పారావు షెట్కార్ కూడలి, రాజీవ్‌కూడలి, అంబేడ్కర్ కూడలి, బసవేశ్వర కూడళ్ల దగ్గర పెద్ద పెద్ద దుకాణాలున్నాయి. రహదారులూ ఇరుగ్గా మారాయి. కొనుగోళ్ల కోసం వాహనాలపై వచ్చినవారు రోడ్ల పక్కనే నిలుపుతుండటంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. కార్లు, జీపులు, బస్సులు, లారీల



ఖేడ్: రాజీవ్ కూడలిలో రోడ్డుపై నిలిపిన వాహనాలు

లాంటి వాహనాలు త్వరగా కదల్లేని పరిస్థితులు నెలకొంటున్నాయి. పట్టణంలోని గల్లీల్లోనూ ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. దుకాణాల్లో పనిచేసేవారితోపాటు కొనుగోళ్ల కోసం వచ్చేవారు రోడ్డుపైనే ద్విచక్రవాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రాంవిలాస్ గల్లీ అత్యంత రద్దీగా మారింది. ఇక్కడ నాలుగు పెద్ద వ్యాపార సముదాయాలున్నాయి. ఈ గల్లీలో రాకపోకలకు మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు.

పెద్ద దుకాణాల ఎదుట..

పట్టణంలోని పెద్ద దుకాణాల ఎదుట పార్కింగ్‌కు స్థలాల్లేవు. దీంతో కొనుగోళ్ల కోసం వచ్చినవారు దుకాణాల ఎదుట రోడ్లపైనే వాహనాలు నిలపక తప్పడం లేదు. దుకాణాలకు సరకులు తీసుకొచ్చే లారీలు, డీసీఎంలు, ఆటోలు సైతం రహదారులపైనే నిలిపి అన్‌లోడింగ్ చేయాల్సి వస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు..

పట్టణంతో రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా రాజీవ్ కూడలి, అంబేడ్కర్ కూడలి, బసవేశ్వర కూడలి, శివరావుశెట్కార్ కూడళ్ల సమీపాల్లో ఎక్కువగా రోడ్ల పక్కన వాహనాలు నిలుపుతున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందుల దృష్ట్యా వాహనదారులు రోడ్లపై వాహనాలను నిలపకుండా సహకరించాలి. – **విద్యాచరణ్‌రెడ్డి, ఎస్సై, ఖేడ్.**

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, జోగిపేట

? అందోలు మండలం తాలెల్మ శివారులోని ప్రధాన రహదారికి ఇరువైపులా పొదలు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. – దుర్గయ్య, తాలెల్మ

✓ రహదారి పక్కన పొదలు తొలగిస్తాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. – రవీందర్, డిప్యూటీ ఈఈ ర.భ. శాఖ, అందోలు.

? జోగిపేట పట్టణంలోని మల్లన్నకాలనీ నుంచి బృందావన్ కాలనీ మీదుగా జాతీయ రహదారి వరకు సీసీ రహదారి నిర్మించారు. దానికి ఇరువైపులా మట్టి వేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. – మహేశ్, జోగిపేట

✓ సీసీ రహదారికి ఇరువైపులా మట్టి వేయిస్తాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. – తిరుపతి, పుర కమిషనర్, అందోలు–జోగిపేట.

తపాలా కార్యాలయాల్లో ఖాతా తెరవండి

సంగారెడ్డి మున్సిపాలిటీ: విద్యార్థులు తాపాలా కార్యాలయాల్లో పోస్టల్ పేమెంట్ ఖాతా తీసుకోవచ్చని జిల్లా ఎస్సీ అభివృద్ధి ఉప సంచాలకుడు అఖిలేశ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25కు సంబంధించి ఉపకార వేతనాలు, రీయంబర్స్‌మెంట్‌కు పోస్టల్ పేమెంట్ ఖాతాతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.



సదాశివపేట: నాగ్‌సాన్‌పల్లిలో..

అలరించిన ఆటలు.. బతుకమ్మ పాటలు

సద్దుల బతుకమ్మ సంబరాలు గురువారం అంబరాన్నంటాయి. జిల్లావ్యాప్తంగా మహిళలు పలు రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. పాటలు పాడుతూ చుట్టూ తిరుగుతూ ఆడారు. తరవాత చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే బృందం.



చిట్కుల్‌లో బతుకమ్మతో కాంగ్రెస్ నాయకుడు నీలం మధు దంపతులు



పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంటి వద్ద



బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకరంలో భద్రకాళి అమ్మవారు



కానుకుంటలో.. ఐడీఏ బొల్లారంలో సదాశివపేటలో..

కమనీయం.. అమ్మ దర్శనం

దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. అర్చకులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. భవానీ మాతను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

– న్యూస్‌టుడే బృందం.



సంగారెడ్డిలో..



సంగారెడ్డి: జయదుర్గాదేవి అలంకరణలో భవానీ మాత

అధ్వానంగా మురుగు కాలువ

హత్నూర: మండల పరిధి దౌల్తాబాద్ ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని అంటున్నారు. పిచ్చి మొక్కలు పెరగడంతో పూడుకుపోతున్నాయన్నారు. వెంటనే శుభ్రం చేసి ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు కొరవడ్డాయన్నారు.

అందుబాటులోకి రవాణా శాఖ సేవలు



భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ఖేడ్‌లో వారానికి రెండ్రోజులు రవాణా శాఖ సేవలతో ఈ ప్రాంత వాసులకు వ్యయప్రయాసలు తప్పుతాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం రైతుబజార్‌లో సేవల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, బీమా, ఫిట్‌నెస్ తదితర సేవల కోసం జహీరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఆయా సేవలను వారంలో రెండ్రోజులు ఖేడ్‌లో అందించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరగా.. ఆయన వెంటనే ఉన్నతాధికారులను ఆదేశించారన్నారు. బుధ, గురువారాల్లో సేవలు అందుతాయన్నారు. రవాణాశాఖ ఉప కమిషనరు వెంకటరమణ, ఎంవీఐ వెంకటయ్య, పుర ఛైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఉపఛైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, నర్సింహులు, రామకృష్ణ, సద్దాం, హన్మాండ్లు, తాహెర్‌అలీ, నర్సింహారెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

సమీకృత గురుకులానికి స్థలం కేటాయింపు..

నియోజకవర్గ సమీకృత గురుకులానికి సిర్గాపూర్ మండలం వాసర్ శివారులో 25 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చిందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. స్థలం లేకపోవడంతో గురుకులం మంజూరు కాలేదన్నారు. ఇప్పుడు మంజూరుకు కృషి చేస్తానన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శిలాపూజ



గుమ్మడిదల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో కల్యాణ రామచంద్రస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి శిలాపూజ నిర్వహించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, కోశాధికారి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచి నర్సింహారెడ్డి, గ్రామపెద్దలు ధర్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

రతన్ టాటాకు పత్ర నివాళి



నారాయణఖేడ్, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా అస్తమయం ప్రపంచానికే తీరని లోటని పలువురు అన్నారు. ఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకుపై రతన్ టాటా చిత్రాన్ని మలిచి నివాళి అర్పించారు.

హత్నూర, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతికి క్రికెట్ క్రీడాకారులు గురువారం సంతాపం ప్రకటించారు. హత్నూరలో పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

పార్కు స్థలం కాపాడరూ..

శేరిలింగంపల్లి: సుదర్శన్‌నగర్ కాలనీకి సంబంధించి పార్కు స్థలాన్ని కాపాడాలని జనం కోసం సంస్థ అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ముకుందరెడ్డికి వినతిపత్రం అందించారు. పార్కు స్థలంలో గతంలో అక్రమంగా ఎల్ఆర్ఎస్ చేశారని పేర్కొన్నారు. అక్రమ ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేసి పార్కు స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవాలి కోరారు.

తాత మందలించాడని..

మనవడి బలవన్మరణం

పుల్కల్, న్యూస్‌టుడే: ఉరేసుకొని బాలుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. చౌటకూరు మండలం లింగంపల్లికి చెందిన బాలుడు(16) పదో తరగతి పూర్తి చేసి వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు. స్నేహితుడి సైకిల్‌పై వెళుతుండగా మిత్రుడి చరవాణి కిందపడి పగిలింది. తన చరవాణి పగలడానికి కారణమయ్యావంటూ వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న బాలుడి తాత తీవ్రంగా మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన బాలుడు బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈదుతుండగా మూర్ఛ.. వ్యక్తి మృతి

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్), న్యూస్‌టుడే: బావిలో ఈదుతుండగా మూర్ఛ వచ్చి నీట మునిగి వ్యక్తి మృతి చెందినట్లు హద్నూర్ ఎస్సై రాము నాయుడు తెలిపారు. మండలంలోని మెటల్‌కుంటకు చెందిన తెనుగు నర్సిములు(29) గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతుండగా మూర్ఛ వచ్చి మునిగిపోతుండగా గుర్తించిన మరో వ్యక్తి కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకుండాపోయింది. నర్సిములు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

పటాన్‌చెరులో గుర్తుతెలియని మహిళ..

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: మూర్ఛతో గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు జాతీయరహదారి నుంచి వెంకటేశ్వరాకాలనీకి వెళ్లే రహదారిలో గురువారం ఉదయం గుర్తుతెలియని మహిళ(40) మూర్ఛ వచ్చి కిందపడిపోయి కొట్టుకుంటుండగా స్థానికులు 108 వాహనంలో పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మహిళ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించగా.. పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు. మృతురాలి సంబధీకులు ఎవరైనా ఉంటే 87126 56756లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడు..

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: పరిశ్రమలో బాయిలర్ వద్ద పని చేస్తూ వేడి నీరు పడి గాయపడిన కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..శంకర్‌పల్లి మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన శంకర్(38) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడ సింథోకెమ్ ల్యాబ్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 1న బాయిలర్ వద్ద పనిచేస్తుండగా తెల్లవారుజాము సమయంలో బాయిలర్ తలుపు తెరిచినప్పుడు ఒక్కసారిగా వేడి నీరు మీద పడింది. కాలిన గాయాలతో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. శంకర్ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృత్యువాత

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మండల పరిధి కల్పగూర్ మదిర అంగడిపేటకు చెందిన చాపల వీరయ్య, కుమ్మరి మహేందర్‌కు చెందిన రెండు పాడి గేదెలు వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గురువారం బాధితులు తెలిపారు. జీవనోపాధి కోల్పోయామని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.


'అలయ్ బలయ్' స్థల పరిశీలన



స్థలం పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, భారాస నాయకులు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: దసరా అనంతరం ఈనెల 41న అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహణకు మండల పరిధి సంగుపేట శివారులోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్ పరిశీలించినట్లు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తెలిపారు. గురువారం భారాస సీనియర్ నాయకులతో కలిసి చూశారు. కార్యక్రమంలో నాయకులు వీరారెడ్డి, నాగభూషణం, జైపాల్‌రెడ్డి, పి.నారాయణ, లింగాగౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఖేడ్ పట్టణానికి చెందిన వీరన్నకు రూ.18 వేలు, మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన అన్సీబాయికి రూ.16వేలు మంజూరయ్యాయి. వాటికి సంబంధించిన చెక్కులను గురువారం ఖేడ్ భారాస కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందించారు. భారాస పట్టణ అధ్యక్షుడు నగేష్, నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్గొండ, నాయకులు చాంగీబాయి, మారుతి, సుధాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఆందోళనలు



తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రాజోల గ్రామస్థులు

జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్- న్యూస్‌టుడే: న్యాల్‌కల్ మండలం రాజోలలో భూ వివాదంలో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి పంట పొలాలు, స్మశానవాటికకు వెళ్లకుండా దారి మూసేశారని గొడవ పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వివాదాన్ని పరిష్కరించి న్యాయం చేయాలని ఇరువర్గాలు తహసీల్దార్, ఠాణాలో ఫిర్యాదు చేసుకున్నాయి. సోమవారం సర్వే చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ భూపాల్ హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమించారు.

ఎలుగుబంటి సంచారం



పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: పంట పొలాల్లో ఎలుగుబంటి సంచారంతో జహీరాబాద్ మండలం రంజోల్, బాబానగర్ శివారులోని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రైతు అఫ్జల్‌మియా పొలంలో గురువారం వన్యప్రాణుల పాదముద్రలు కనిపించడంతో ఏఈవో ప్రదీప్‌కుమార్ జహీరాబాద్ అటవీ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ అధికారి కృష్ణమ్మ, బీట్ అధికారులు సంతోషి, భాస్కర్, సంజీవ్, తుకారాం తదితరులు పొలాల్లో తిరిగి పరిశీలించారు. పాదముద్రలు ఎలుగుబంటివాటిని పోలి ఉండటంతో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చేతిలో కర్రలతో పొలాలకు వెళ్లాలని, శబ్దం చేస్తూ ముందుకు కదలాలన్నారు. చెట్లు, పంటల మధ్య కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

హత్నూర, న్యూస్‌టుడే: అనుమతుల్లేని నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మండల పరిధి బోర్పట్ల యువకులు కోరారు. గ్రామంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ సమీపంలోని ఫార్మా పరిశ్రమ లోపల అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. మల్లేశం, శ్రీశైలం, క్రాంతికుమార్, వినోద్‌కుమార్, చంద్రశేఖర్, అనిల్‌కుమార్, గణేశ్ ఉన్నారు.

భాజపా సభ్యత్వ నమోదుకు ఆదరణ

మియాపూర్, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదును ఆయన గురువారం భాజపా శేరిలింగంపల్లి ఇంఛార్జి రవికుమార్ యాదవ్‌తో కలిసి పరిశీలించారు. మియాపూర్, హైదర్‌నగర్, లింగంపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో పలువురికి ఆయన చేతుల మీదుగా భాజపా సభ్యత్వాన్ని అందజేశారు. సభ్యత్వ నమోదు విజయవంతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు.

భారీ యంత్రం.. కదలిక భారం

ప్రధాన రహదారిపై భారీ యంత్రాన్ని తరలిస్తున్న కంటైనర్‌తో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. నెమ్మదిగా కదులుతుండడంతో వెనకాల వస్తున్న వాహనదారులు అంచనా వేయలేకపోతున్నారు. రాత్రివేళ మండల పరిధి చందాపూర్ శివారులో ఆగింది. హైదరాబాదు నుంచి మహారాష్ట్రకు యంత్రాన్ని తరలిస్తుండగా విద్యుత్తు తీగలు తాకుతున్నాయని వాహన చోదకుడు తెలిపాడు. విద్యుత్తు సరఫరా నిలిపేస్తూ కేవలం రాత్రివేళల్లో తరలిస్తున్నామన్నాడు. – న్యూస్‌టుడే, హత్నూర.



మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి అనూష అన్నారు. పట్టణంలోని కోర్టు సముదాయంలో గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. దినచర్యలో భాగంగా నిత్యం యోగా, ధ్యానం, ఉదయం, సాయంత్రపు నడకలతో మానసికంగా మరింత దృఢం కావాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నారాయణఖేడ్: మండల పరిధి చాప్టా(కె)కు చెందిన సంగప్ప కుమార్తె చెన్నేశ్వరి ఇటీవల మృతిచెందారు. గురువారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. సిర్గాపూర్ మండల భారాస అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు సంగప్ప, సంతోష్ రెడ్డి, హనుమారెడ్డి, రాంగొండ, భీమప్ప ఉన్నారు. ● పుర కార్మికుడిగా పనిచేసిన సాయిలు మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు చిరంజీవి, అశోక్, రవి, అంజయ్య కోరారు.